దరిద్రం

దరిద్రం వల్ల బాధపడతారే కాని దాని అర్థం ఏమిటో ఆలోచించినవారెందరుంటారు? ఆలోచిస్తే ఏమి తేల్తుంది? ప్రయోజనం?

రాత్రి ఒంటిగంటప్పుడు రమణ మంచంమీద లేచి కూర్చున్నాడు. మూడురోజులై తనకు దూరమైన నిద్రకోసం ఇంతప్రయత్నం ఎన్నడూ చేయలేదు. నిద్ర దానంతట అది ముంచుకు రావాలిగాని, దానికోసం ఇంత ప్రయత్నమేమిటనుకున్నాడు రమణ. తనతోపాటు రెండురాత్రులు, ఎందుకో అర్థంకాకుండానే మేలుకొన్న కాంత - ఇప్పుడు అమాయకంగా, నిద్రపోతున్నది పాపం, కాంత! తన్ను పెళ్లిచేసుకొన్న రెండోరోజునుంచే, తన దరిద్రం పంచుకోవడం అలవాటు చేసుకొన్నది. ఈ దరిద్రంలో తను దాదాపు ఏడాదికిందట ఎందుకు పెళ్లి చేసుకున్నదీ తనకే అర్థంకాలేదు. ఈ దరిద్రానికి చాలనట్టుగా, మరో నెలాళ్లలో కాంత కనబోతున్నది!

తన్నుపట్టి పీడిస్తున్నది దరిద్రమనే పూర్తిగా నమ్మాడు రమణ. దరిద్రం కాకుంటే మరేమిటి? తనుపుట్టి పెరిగిన తన ఊరు - అది తన స్వస్థలం కాకపోయినా, అసలు తనకు స్వస్థలమంటూ లేకపోయినా - కనీసం- తన తెనుగుదేశం. తనూ తన కాంతా బతకటానికి నెలకో వందరూపాయలైనా ఇవ్వలేకపోయింది. ఇవ్వతలచుకుంటే ఇచ్చిఉండేదని తప్పు పట్టగలిగిన రమణకు, ఈ దరిద్రం తనకే కాదనీ, తనదేశంలోనే కొన్ని లక్షలమందికికూడా తనదేశం ఇదే దరిద్ర్యాన్ని ప్రసాదించినదనీ తట్టనట్టులేదు. కేవలం తను ఒక్కడే ఇంత అన్యాయానికి పాల్పడ్డానని రమణ అనుకోవడంలో రమణ పొరపాటుపడిఉండవచ్చు - అయితే తనవంటి ప్రతిదరిద్రుడూ ఇదేపొరపాటుపడుతున్నాడనిమాత్రం రమణకు తట్టలేదు.

తనతండ్రి విషయంకూడా అంతంతమాత్రంలోనే ఉందని రమణ ఎప్పుడైతే గ్రహించాడో ఆనాడే. తనతండ్రిమీద రెండుచేతులా భారమైనా తగ్గించాలని, పొట్టచేతబట్టుకుని వెయ్యిమైళ్ళదూరం ప్రయాణంచేశాడు. తనవంటివాళ్లు తన తండ్రి మీద ఇంకా ఆరుగురు ఆధారపడి ఉన్నారు. అయితే, తను గురించి అంతసులభంగా దరిద్రాన్ని తనతండ్రిగుర్తించినట్టు కనపడలేదు. దరిద్రం తాండవిస్తున్నదన్న విషయం గుర్తించకపోవడం మాట అటుంచి, మనం దరిద్రంతో - క్లేశంలో పడ్డ ఈగల్లాగా కొట్టుకుంటున్నాం అన్న విషయం ఎవరూకూడా గుర్తించకుండా చేశాడు తండ్రి. ఇందుకు రమణ తనతండ్రిని చాలా అభినందించుకున్నాడు. తనలో ఇక తనంతటతానే ఈ యధార్థం గుర్తించటంవల్ల, తనకు జరిగిందేమీ కనిపించకపోగా, చింత ఎక్కువయింది

మూడురోజులై రమణ, దరిద్రంఅంటే యేమిటి అని చేసుకుంటున్న తర్జనభర్జనతో అతనికి నిద్రపట్టలేదు. రెండుపూటలూ కడుపునిండా తినటానికి తన ఆదాయం అనుమతించటంలేదు. రాత్రులు తినేతిండి తనకు వొంటపట్టటంలేదని కాంతతో అబద్ధమాడి, మానేశాడు. కాంతకు ఇటువంటి సమయంలో అవసరమైనపళ్ళు అవీ ఇస్తూఉండటంలో కొత్త అప్పుకూడా పెరిగింది అప్పంటూ పుట్టింది! అమాత్రం పరపతి - ఈ దరిద్రంలో - పుట్టించుకోవటం ఘనతకిందే ఎంచుకున్నాడు రమణ.

అమాంబాపతులన్నీ కలిపి, తన ఆదాయం నెలకు నూటయాభైరూపాయలలోనూ మూడోవంతు, తను కాపురముంటున్న ఒక్కగదికీ ఇవ్వాలి పోతే, నూరురూపాయలన్, ఈ జీవితం లాగటం కష్టంతో కూడుకున్న పనిగానే తోస్తున్నది. అయితే, ఇంతకన్నా తక్కువజీతగాళ్లు, బంట్రోతులూ మొదలైనవారు, ఈ దరిద్రాన్ని ఎలా ఎదుర్కొంటున్నారో రమణకు అర్థంకాలేదు. చూస్తూచూస్తూ, వాళ్లు బతుకుతున్న పద్ధతిలో తను బతకలేడు. అదిఒక్కటే కారణం అనుకున్నాడు.

కాంత కదిలింది. కదలటమేమిటి! ముసుగుతొలగించి మెల్లగా తనవైపు చూసింది.

"మీరు నిద్రపోవటంలేదూ?" అన్నది కాంత

"నాకు నిద్రపట్టలేదు" అన్నాడు రమణ.

"పడుకోండీ అదేపడుతుంది మీకెప్పుడూ ఒకటే ఆలోచన!" అన్నది కాంత

నిజం తనకెప్పుడూ ఒకటే ఆలోచన అన్నవిషయం కాంతకు తెలిసింది దరిద్రం గురించి, ఈ దరిద్రపు ఆలోచన దరిద్రం తీరితేగానిపోదు తనుఉన్న స్థితిలో ఇటువంటి దరిద్రంతీరే సాధనం కనపడటంలేదు.

"నాకు కొంచెం తోడుంటారా?" అన్నది కాంతలేచి.

"పద" అంటూ తనూలేచాడు రమణ

కాంత బయటకువెళ్లి తిరిగివచ్చి పడుకున్నది

"నాకు ఏమోమాదిరిగా ఉన్నదండీ" అన్నది కాంత కొత్త ఆయాసంతో.

"ఎలాఉంది?" అన్నాడు రమణ.

కాంత సమాధానమివ్వకుండా అటువైపుకు తిరిగి పడుకున్నది.

"నెప్పిగాఉందా?" అన్నాడు రమణ ఏదో అనుమానంతట్టి

"ఏమో!.. తెలీదు" అన్నది కాంత.

కాంతకు నెప్పులు ప్రారంభం కాదుకదా! తనదగ్గర ఒక అయిదురూపాయల కాగితంతప్ప వేరేమీలేదు ఇదేనా తెల్లవారగానే లేడీకే సరిపోతుంది. ఇప్పుడు కాంతకు నిజంగానే నెప్పులారంభమవుతే, ఎవర్ని ముష్టెత్తేది? ఏంచేయాలి?

తినటానికితిండీ, జీవితంలో కావలసిన కనీసపు అవసరాలూ లేకపోవటంకన్నా దరిద్రం ఇంకేముంటుందిమరి? దరిద్రం అనేక రూపాలలో ఉత్పత్తి అవుతూ ఉంటుంది. ఎంత వారికి అం త దరిద్రం. తను అను కొంటున్న దరిద్రంక కన్న హీనమైనస్థితిలో ఉండేవారికి స్వర్గంగా

శ్రీ పన్యాల రంగనాధరావు

తోచవచ్చు.

అన్ని తరగతులవారికీ దరిద్రంఅంటే ఒకే అర్థం తోచినప్పటికీ, ఒక్కొక్కరికి ఒక్కొక్క రూపంలో అది ప్రత్యక్షం కావటంలోనే ఉంది. మధ్యతరగతిలో కిందితరగతివారికి చెందిన రవణదరిద్రం పెద్దదరిద్రం కాకపోవచ్చు. కాని, ఇదే పెద్దదరిద్రమని రవణఊహించటానికీ, అది తీర్చుకోలేక మథనపడటానికీ రవణకున్న కొద్దిపాటి సంస్కారందోహదం చేసిందని చెప్పాలి దరిద్రాన్ని దరిద్రంగా గుర్తించుకోనడంలోనూ, అదితీర్చుకోటానికితగిన శక్తిలేకపోవడంలోనూ ఉంది చిక్కు ఈ చిక్కు తీర్చుకోవాలంటే రవణకు ఎదురైన సాంఘికపరిస్థితులు అతనికి ఏమాత్రమూ సహాయంచేయకపోగా, రవణని మరింత దరిద్రుణ్ణిచేశాయి.

'డబ్బుతే లేనట్టి నరులకు కీర్తి సంపద లబ్బవోయ్' అన్నముక్క జ్ఞాపకమొచ్చింది రవణకి తనకు కీర్తి వద్దూ, సంపదావొద్దు అంతకన్నాముందు కనీసపు కోరిక - తనవంటివారి ఈ దరిద్రానికి పరిష్కారం కనిపిస్తే అదే పదివేలు. కీర్తి సంపదల సిగతరిగిరి!

తను వేసుకున్న లెక్కప్రకారం కాకుండా, పదిహేనురోజులు ముందుగానే రవణకు దరిద్రం. ఒక కొత్త రూపంలో ప్రత్యక్షమయింది ఈసారి సుపుత్రుడి రూపంలో!

అయితే రవణ, దీన్ని, దరిద్రం తాలూకు ప్రత్యక్షావతారంగా భావించలేదు. తను ఒక తండ్రిఅయినాడన్న పితృభావం ఇందులో ఇమిడిఉన్న దరిద్రభావాన్ని అణిచివేసింది. ఆరోజున రవణ అనుభవించినంత ఆనందం ఎన్నడూ అనుభవించలేదు. ఆ ఆనందంతోనే, మూడోనాడు ఒక కార్డు సంపాదించి, తల్లికి ఉత్తరంరాశాడు

"మ. ల. స. అమ్మకి. నిన్న పదిహేనోతారీఖు తెల్లవారుఝామున-అంటే అయిదూ పదినిమిషాలకు నీకు ఇక్కడ ఆస్పత్రిలో మనుమడు కలిగాడు తల్లీపిల్ల క్షేమం. ఈ శుభవార్త అందరికీ తెలియచేయవలసింది"

ఇది పోస్టుచేసిన సాయంకాలమే, తను తాత్కాలికంగా మరిచిన దరిద్రం రెట్టింపుతో మరో రూపంలో సాక్షాత్కరించింది రవణకి. ఈ దరిద్రం, తండ్రి రాసిన ఉత్తరంలో కనిపించింది

"—ఇవేళకి పదిహేను రోజులై మీ అమ్మ జబ్బులో తీసుకొంటోంది. టాన్సిల్ పెరిగిందిట. ఆపరేషను అవసరమంటున్నారు. నువు పెద్దవాడివి. ఒకసారి వచ్చి, తల్లినిచూసి వెళ్తావా?"

ఒక్కొక్కప్పుడు దరిద్రానికి పాటూత్తుగాకూడా ప్రత్యక్షమయ్యేశక్తి ఉంటుందని రవణ ఊహించలేకపోయినాడు. తను ఉన్నస్థితిలో, తక్షణం ఎట్లాప్రయాణం చేయటమో తెలీలేదు. కడసారి, తల్లిని ఒక్కపర్యాయం చూసుకోటానికి అవకాశంలేకపోవటం అన్నింటికన్న మించిన దరిద్రం

"నాన్నగారికి, కాంతకు పురుడువచ్చిందని నిన్ననే అమ్మకు రాశాను. ఈ పరిస్థితిలో దాన్నివొదిలి ఎట్లారాగలనో అర్థం కాకుండాఉంది. అమ్మకు ఎలాఉన్నదీ వెంటనే రాయండి—"

తను రాలేనన్నవిషయం స్పష్టంగా రాయటానికి ఇంతికన్న చేతకాక, ఒక ఉత్తరంరాసి పోస్టుచేసి వొక్కడే తన గదిలో, దిండులో ముఖంపెట్టి, రవణ వెక్కివెక్కి ఏడవటం, భగవంతుడనేవాడుంటే, వాడికి వినపడిఉండాలి

ఆ దుఃఖంలోనే కాంతా, తన చిన్నకొడుకూ జ్ఞాపకంరాగా, రవణ వెంటనే లేచి, ఆస్పత్రి చేరుకొనేసరికి, అప్పటికే వేళమించిపోయి, గేట్లు మూసేశారు.

ఈసారి రవణకు దుఃఖం రాలేదు. ఆస్పత్రిఉన్నచోటమాత్రం, పెద్ద సముద్రం—సముద్రంమీద దరిద్రదేవత నాట్యంచేస్తున్నట్టూ కనిపించాయి. ★

వ్యధితహృదయం

(13-వ పేజీ తరువాయి)

కమిటీ నాకు ఎదురుతిరిగింది ..నా మాట ఏదీ వాళ్ళకి నచ్చటంలేదు. .నేను చెయ్యగలిగిందేమీలేదు . యింకా ఏదో అంటున్నారు ప్రిన్సిపాలు. తరువాత మాట లేవీ అరవిందానికి వినిపించటంలేదు. కన్నీరు మాత్రం ధారలుగా చెక్కిళ్ళమీదుగా ప్రవహిస్తోంది వెళ్లిగా వంగి ప్రిన్సిపాలుగారి కాళ్ళకి వందనంచేశాడు 'నాగురించి మీరు విచారించకండి—మీ హృదయం నాకు తెలుసు 'వస్తానంటూ సెలవు తీసికొని, భారంగా రూముకి చేరాడు తన తండ్రివంకనుంచి ఆశలేదు యితర వ్యక్తుల నాశ్రయించడం అరవిందానికి యిష్టంలేదు

పరీక్ష మొదటిరోజున, తోటివిద్యార్థులందరూ పరీక్ష రాస్తుంటే, అన్ని సబ్జక్టులూ బాగా చదివిన అరవిందంమాత్రం ఊరి బయట ఏ మామిడితోపులోనో, కాలువ గట్టుమీదో ఆ కాలంలోకి శూన్యంగామాస్తూ కూర్చునేవాడు మూడోరోజున గాబోలు ప్రిన్సిపాలు అరవిందానికి కబురంపాడు. 'డబ్బు విషయం తర్వాత చూసికోవచ్చు, పరీక్షకి రావలసిందని'. గాని అరవిందంలోని ఆత్మాభిమానం సమ్మతించలేదు అప్పటికే రెండు పరీక్షలయ్యాయి. ఫస్టుక్లాసు రావలసిన తనుపార్టు మిగులుతో పోవడమూ.. నిరుత్సాహంతో, ఆ సహాయం కూడ నిరాకరించి, రెండేళ్ళ చదువూ వ్యర్థం కాగా, కాలేజీలోంచి యివతలికి వచ్చేశాడు అరవిందం శాశ్వతంగా

యీవిషయం జరిగి యిప్పటికి రెండేళ్ళయింది యీ రెండేళ్లూ అరవిందం తండ్రివద్దే ఉన్నాడు తన చదువువిషయం తెలిసినదగ్గరినుంచీ ఎంతయినా యత్నించాడు డబ్బుకోసం, యింకా యిత్నిస్తూనే ఉన్నాడు కాని . ఆదాయానికి మూడింతలు ఖర్చున్న ఆ సంసారంలో అరవిందానికి ప్రత్యేకంగా రెండు వందలు రాలాలంటే అంత సులభంకాదు తనే కాలేజీకి డబ్బు కట్టవలసి రావడంతో తన స్కూల్ ఫయినల్ సర్టిఫికేటుకూడా కాలేజీలో చిక్కుపడింది యిప్పుడు తను చదివిన చదువుకి నిదర్శనం కూడ లేదు

పోనీ యిల్లువదిలి ఎటయినా పోయి సంపాదించుదామనుకున్నాడు అరవిందం. యింట్లో తనొకడే కాస్త అందుబాటులో ఉన్నాడు తను లేకపోతే వీళ్ళని ఎవరు కనిపెట్టి ఉంటారు సంపాదించిపెట్టినా పెట్టకపోయినా, ఉన్న నలుగురూ కళ్ళముందు తిరగాలని ఆశించే తలిదండ్రులని కాదనటం ఎలా!. పయిగా తనకి సర్టిఫికేట్లే లేవే... ఎక్కడికి పడితే ఎవరు చూస్తారు తన మొహం తనకున్న చదువూ .. విజ్ఞానం ఆ ఒక్క కాగితం ముక్క లేకపోవడంతో ముడిచిపెట్టుకుపోయాయి. తనతో చదివి పాసుపోయినవాళ్లు యిప్పుడు బి ఏలు అయిపోతున్నారు. తనుమాత్రం ఎదుగూబొదుగూలేకుండా మొండిగా నిలబడిపోయాడు. ఇంత వెగటుజీవితంలోనూ, అరవిందం సారస్వతసేవ వదలలేదు. అతని గేయాలు ... రచనలూ .. పత్రికలూ . ప్రీతితో మన్నిస్తాయి. అదే అతనికి హృదయశాంతి కాని అదిక్షణికం. ఆ వ్యర్థపు చదువూ.. యీ నిరుద్యోగ జీవనమూ తలచుకుంటుంటే మనస్సు వికలమయిపోతూంది అరవిందానికి.

పాతికేళ్లు సమీపిస్తున్న అరవిందం, తండ్రి అండలో, తన శుభదినాలు కల్పించుకొని. ఆశిస్తూ.. ఎదురుచూస్తూ...గమ్యంలేని పథికుడిలా . జీవితం వెళ్లబుచ్చుతున్నాడు. 'యింకా తనలాంటి అభాగ్యులెంతమంది లోకంలో ఉన్నారో అనుకుంటూ' ! ★